అతివకు అగ్రతాంబూలం

- మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా మహిళా మార్ట్‌లు
- పొదుపు సంఘాల సభ్యులు మార్ట్‌లో వాటాదారులు



వినియోగదారులతో కళకళలాడుతున్న ఉప్పలగుప్తం చేయూత మహిళా మార్ట్

ఉప్పలగుప్తం: మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా మార్ట్‌లకు శ్రీకారం చుట్టి అతివకు అగ్రతాంబూలం ఇస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో ఉప్పలగుప్తం, ముమ్మిడివరం మండలాల్లో ఏర్పాటుచేసిన చేయూత మహిళా మార్టుల్లో దిగ్విజయంగా వ్యాపారం కొనసాగిస్తున్నారు. వీటిలో నాణ్యమైన సరకులు సరసమైన ధరలకు లభిస్తున్నాయి. దీంతో పొదుపు సంఘాల మహిళలు నేడు మార్టులకు వాటాదారులయ్యారు. ఇంతింతై వటుడింతయై అన్నట్లు చిన్నమొత్తాలతో వ్యాపారం మొదలుపెట్టి దాన్నే లక్షల్లో ఆదాయానికి తీసుకెళుతున్నారు.

సంఘ సభ్యులే వాటాదారులు

ఉప్పలగుప్తం మండలంలోని మొత్తం 1,542 స్వయం సహాయక సంఘాల్లో 15,420 మంది సభ్యులున్నారు. ఒక్కొక్క సభ్యురాలి వాటాగా రూ.200 చొప్పున పెట్టుబడి పెట్టి రూ.27 లక్షలతో మార్ట్‌ను ఏర్పాటుచేశారు. రోజూ సరాసరిన రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకూ రోజువారీ వ్యాపారం కొనసాగుతుంది. ప్రతి రూపాయికి సమాధానం ఉండేలా కొనుగోలుదారునికి రశీదు అందజేస్తున్నారు. ఉప్పలగుప్తం చేయూత మహిళా మార్ట్‌కు జీఎస్టీ, ఫుడ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ చేసుకుని వ్యాపారం మొదలు పెట్టారు. ముగ్గురు మహిళలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. మార్ట్ నిమిత్తం ప్రధాన పాత్ర పోషించి లావాదేవీలన్నీ వారి ఆధ్వర్యంలోనే సాగుతున్నాయి.

ఏడాది తరువాత ఆడిట్

ఏడాది తరువాత మార్ట్ తాలూఖా లావాదేవీలను ఆడిట్ జరిపి పెట్టుబడి, ఖర్చులు తీసి మిగిలిన సొమ్మును స్వయం శక్తి సంఘాల మహిళల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఇప్పటికే మహిళా శక్తి సంఘాలకు బ్యాంకు రుణాలు, రూ.52 వేలు చొప్పున శ్రీనిధి రుణాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు జగనన్న చేయూత పథకంతో రూ.18,750 ఇప్పించి చిన్నతరహా కిరాణా షాపుల్లో మహిళలు వ్యాపారం చేసుకునేలా ప్రోత్సహిస్తున్నారు. వీరి కోసం జిల్లా అధికారులు ఒక అడుగు ముందుకేసి బయట వర్తకుల నుంచి అధిక ధరలకు కొనుగోలు చేస్తున్న సరకులను మార్ట్ ద్వారా తక్కువ ధరలకే డోర్ డెలివరీ చేసేలా ప్రయత్నాలు చేస్తున్నారు.

ఉప్పలగుప్తం మహిళా మార్ట్‌లో ఈ ఏడాది జూన్ 17 నుంచి కొనసాగిన లావాదేవీలు

నెల	కొనసాగిన వ్యాపారం (రూ.ల్లో)
జూన్	4,43,284
జూలై	8,27,542
ఆగస్ట్	6,57,243
సెప్టెంబర్	5,14,377
మొత్తం	24,42,446

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



ప్రతి మహిళా స్వయం శక్తితో ఆర్థికంగా ఎదగాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా మార్ట్‌లు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. మార్ట్‌లో తక్కువ ధరకే నాణ్యమైన వస్తువులు లభ్యం కావడంతో వినియోగదారుల ఆదరణ పెరిగింది. బయట వర్తకుల దగ్గర జరుగుతున్న ధరలు, మార్ట్‌లో జరుగుతున్న ధరలు ప్రజలకు చేరేలా వాట్సాప్ గ్రూపుల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ వి.శివశంకర ప్రసాద్, ప్రాజెక్ట్ డైరెక్టర్, డీఆర్‌డీఏ

విక్రయాలు పెంచటానికి కృషి చేస్తున్నాం



నూతనంగా ఏర్పాటుచేసిన మహిళామార్ట్‌లో విక్రయాలు పెంచటానికి ప్రత్యేక కృషి చేస్తున్నాం. గ్రామాల్లో మహిళలకు అవగాహన కల్పిస్తున్నాం. లావాదేవీలపై ఏడాదికోసారి ఆడిట్ నిర్వహిస్తాం. మార్ట్ ద్వారా వచ్చే ఆదాయాన్ని పెట్టుబడి పెట్టిన ప్రతి పొదుపు మహిళకు సమానంగా పంచుతాం.

– కె.వెంకటలక్ష్మి, వెలుగు ఏపీఎం, ఉప్పలగుప్తం మండలం

తక్కువ ధరకే నాణ్యమైన సరకులు



నేను ప్రతి నెలా ఇక్కడికే వచ్చి సరకులను తీసుకుంటున్నాను. నాణ్యమైన సరకులను తక్కువ ధరలకే అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన మేము మార్ట్‌కు భాగస్వాములు కావడం ఆనందంగా ఉంది. ప్రభుత్వం మహిళల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించి ఆర్థికంగా ప్రోత్సహిస్తుంది.

– ఎ.భవాని, భీమనపల్లి, ఉప్పలగుప్తం మండలం

ఘనంగా గణపతి హోమం



టి.కొత్తపల్లి గణపతి మండపం వద్ద భక్తులు



108 కేజీల లడ్డూను సమర్పించిన మత్స శ్రీపతి తదితరులు

ఐ.పోలవరం: మండలంలోని వాడవాడలా గణపతి నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. టి.కొత్తపల్లి పంచాయతీ పరిధి వడగనవారి మెరకలో యువకులు, విద్యార్థులు ఏర్పాటుచేసిన లక్ష్మీగణపతి మండపం వద్ద స్వామికి పంచామృత అభిషేకం, గరిక పూజ, లక్ష్మీగణపతి హోమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మురమళ్ల మార్కెట్ సెంటర్‌లో వేంచేసిన గణపతి పందిళ్లలో ఆదివారం భారీ అన్న సమారాధన జరిపారు. సుమారు వెయ్యి మందికి పైగా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

గణనాథునికి 108 కేజీల లడ్డూ

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలోని కనకాలపేట రామాలయం సెంటర్‌లో నెలకొల్పిన వరసిద్ధి వినాయకుడి మండపంలో స్వామివారికి ఆదివారం ప్రముఖ వ్యాపారవేత్త మత్స శ్రీపతి(శ్రీను) 108 కేజీల లడ్డూను సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రూ.19 వేలు పలికిన గణపతి లడ్డూ



వేలం పాటలో దక్కించుకున్న లడ్డూను ఊరేగింపుగా తీసుకెళుతున్న జయకృష్ణ



వేలంపాటలో లడ్డూ దక్కించుకున్న భక్తుడు రామకృష్ణ

అల్లవరం: మండలంలోని దేవగుప్తం సెంటర్‌లో కొలువైయున్న వరసిద్ధి వినాయక ఆలయంలో వినాయక చవితి పురస్కరించుకుని చిట్టూరి వెంకట నారాయణ దంపతులు స్వామివారికి 10 కేజీల లడ్డూను సమర్పించారు. ఈ లడ్డూను గ్రామానికి చెందిన కుడిపూడి జయకృష్ణ రూ.19 వేలకి వేలం పాటలో ఆదివారం దక్కించుకున్నారు. లడ్డూను పురవీధుల్లో ఊరేగించి ఇంటికి తీసుకెళ్లారు. తొలుత ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

అమలాపురం రూరల్: మండలంలోని చిందాడగరువు గ్రామంలో చవితి వేడుకలను పురస్కరించుకుని కొలువుదీర్చిన గణనాథుని పందిరిలో ఏర్పాటుచేసిన లడ్డూ వేలం పాట ఆదివారం నిర్వహించారు. శెట్టిపల్లికి చెందిన భక్తుడు రంకిరెడ్డి రామకృష్ణ రూ.3,700కు దక్కించుకున్నారు. ఆలయకమిటీ సభ్యులు లడ్డూను రామకృష్ణకు అందజేశారు. అనంతరం ఊరేగింపుగా స్వామివారి లడ్డూను తీసుకెళ్ళారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు



బండారులంకలో గణనాథునికి పూజలు చేస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: మండలంలోని పాత బండారులంకలో శ్రీనివాస బాల గణపతి ఆలయంలో చవితి ముగింపు ఉత్సవాలకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ విచ్చేసి గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన హోమ క్రతువులో మంత్రి పాల్గొన్నారు. తొలుత స్వామివారికి విశేషాలంకరణ అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీటీసీ అంకం హిమ భారతి, మాజీ ఎంపీపీ ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత సెల్ అధ్యక్షుడు కాలెపు శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి జాన గణేష్, పెదపూడి బాబూరావు, గోసంగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు రోటరీ సత్కారాలు



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించిన రోటరీ ప్రతినిధులు

రాజోలు: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న రాజోలు, మామిడికుదురు మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు రాజోలు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు ఏడిద కవీంద్ర, చిట్నీడి లక్ష్మణరావుల ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు ఏఎస్‌ఆర్‌కే రాజు, కేవీ రాఘవరావు, ఆర్.చెల్లాయమ్మ, ఉత్తమ ప్రతిభా అవార్డు అందుకున్న వ్యాయామ ఉపాధ్యాయుడు చొప్పల చంద్రశేఖర్, పెచ్చెట్టి రామకృష్ణలను ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈఓ నల్లి మనోహరం మాట్లాడుతూ రోటరీ విద్యా వ్యవస్థకు అందిస్తున్న సేవలను కొనియాడారు. రోటరీ జిల్లా గవర్నర్ నల్లి శివశంకర్, డాక్టర్ బసవా వరహాలు, దార్ల పెదబాబు, మహ్మద్ కిష్వర్, నామన షణ్ముఖ్, ఐ.సూర్యనారాయణ తదితరుతు పాల్గొన్నారు.

గడప గడపకూ నిధులతో పక్కా రహదారులు



నగరంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో పక్కా సిమెంట్ కాంక్రీట్ రోడ్లు నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. నగరంలో గడప గడపకు నిధులు రూ.40 లక్షలతో చేపట్టనున్న పలు సీసీ రోడ్లకు ఎమ్మెల్యే ఆదివారం భూమిపూజ చేశారు. పెదపట్నంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గుర్తించిన సమస్యలను పరిష్కరించే దిశగా కార్యాచరణ చేపట్టామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో పక్కా సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. చెప్పినవన్నీ చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు ఆశీస్సులు అందించాలని కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమాల్లో అప్పనపల్లి దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సర్పంచ్ జాలెం రమణకుమారి, ఎంపీటీసీ జాలెం అనూష, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కొమ్ముల శ్రీనివాస్, కడలి శ్రీనివాస్, పార్టీ నేతలు జాలెం కృష్ణారావు, యేడిద లక్ష్మణరావు, తవిటికి వెంకన్నబాబు పాల్గొన్నారు.

చురుగ్గా జగనన్న సురక్ష సర్వే



ఎన్.కొత్తపల్లిలో ఆరోగ్య సురక్ష సర్వేలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



వానపల్లిలో ఆరోగ్య సురక్ష సర్వేలో మహిళకు బీపీ పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ఉప్పలగుప్తం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని ఎన్.కొత్తపల్లి సచివాలయం–2లో స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది ఇంటింటా సర్వే చేపట్టారు. బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తున్నారు. జ్వర పీడితులను గుర్తించి వారికి డెంగీ, మలేరియా పరీక్షలను కూడా నిర్వహిస్తున్నారు.

అలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చురుగ్గా జరుగుతుంది. పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలో వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి రక్త పరీక్షలు నిర్వహించి వివరాలు నమోదు చేసుకున్నారు.

కొత్తపేట: మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమం చురుగ్గా సాగుతుంది. ఈ నెల 30 నుంచి సచివాలయాల పరిధిలో ఒకచోట జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల 15 నుంచి పీహెచ్‌సీల సిబ్బంది ఇంటింటా అనారోగ్య బాధితులను గుర్తించే కార్యక్రమం చేపట్టారు. ప్రస్తుతం అవిడి పీహెచ్‌సీ పరిధిలో మోడేకుర్రు–2, పలివెల–1 సచివాలయాల పరిధిలో, వానపల్లి పీహెచ్‌సీ పరిధిలో కొత్తపేట సచివాలయం –2, వానపల్లి సచివాలయం–2, 3, వాడపాలెం–2, బిళ్లకుర్రు, కపిలేశ్వరపురం మండలం కేదార్లంక గ్రామాల్లో ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు కేఎస్ఎస్‌బీ హర్ష, పి.రవికుమార్, ఆర్ దివ్యపావని, పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారులు, పర్యవేక్షణ అధికారులు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే చేస్తున్నారు. ఆయా కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితులను ఆరా తీస్తున్నారు. అవసరమైన మేరకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం అవసరమైన మందులు ఇస్తున్నారు. అనారోగ్య రుగ్మతలతో బాధపడుతున్న వారికి, దీర్ఘకాలిక రోగులకు టోకెన్ ఇచ్చి ఈ నెల 30న స్పెషలిస్టులు హాజరయ్యే ప్రత్యేక వైద్య శిబిరాలకు రావాలని సూచిస్తున్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు.

వాడపాలెంలో నేడు నాటక ప్రదర్శన



జూనియర్ డీవీ సుబ్బారావు



రత్నశ్రీ



జబర్దస్త్ అప్పారావు

కొత్తపేట: మండలంలోని వాడపాలెం పాత మార్కెట్ వీధి శ్రీఆది గణపతి నవరాత్ర ఉత్సవ పందిరిలో సోమవారం రాత్రి దేవనర్తకి, సత్యహరిశ్చంద్ర (కాటిసీను) పౌరాణిక నాటకాలు ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు ఉత్సవ కమిటీ సభ్యుడు గనిశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. ఏటా వాడపాలెంలో గనిశెట్టి చంద్రశేఖర్, బండారు భాస్కరరావు, సింగిరెడ్డి గోవిందుస్వామి, కురచ ప్రకాశరావు తదితర కమిటీ సభ్యులు, కళాపోషకులు నాటక రంగానికి పూర్వ వైభవం తీసుకురావాలనే లక్ష్యంతో నాటక, సాంస్కృతిక ప్రదర్శనలు పునరుద్ధరించిన విషయం తెలిసిందే. విధిగా ప్రస్తుత రంగస్థల రారాజు, అభినవ హరిశ్చంద్రుడిగా ఖ్యాతిఘడించిన జూనియర్ డీవీ సుబ్బారావును ప్రత్యేకంగా తీసుకువచ్చి సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ ఏడాది విభిన్నంగా తొలుత దేవనర్తకి, అనంతరం సత్యహరిశ్చంద్ర (కాటిసీను) నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. జూనియర్ డీవీ సుబ్బారావు దేవనర్తకిలో భవానిశంకరుడు, హరిశ్చంద్రలో హరిశ్చంద్రుడు పాత్రలు పోషిస్తుండగా, కడప రత్నశ్రీ దేవనర్తకి, చంద్రమతిగా, జబర్దస్త్ అప్పారావు సుబ్బారావుగా, ఇతర పాత్రల్లో ప్రముఖ రంగస్థల నటులు నటిస్తున్నారు.

క్లుప్తంగా

నేడు దేవీ నవరాత్రుల రాట ముహూర్తం

యానాం: యానాం పట్టణ పరిధిలో కొలువైన శ్రీలలితాదేవి ఆలయం వద్ద సోమవారం దేవీ నవరాత్రుల రాట ముహూర్తాన్ని నిర్వహించనున్నట్లు లలిత భక్తమండలి బృందం సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

దేవస్థానం చైర్మన్ సురేష్‌కు సత్కారం



చైర్మన్ సురేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న రజక సంఘ సభ్యులు

ముమ్మిడివరం: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామి దేవస్థానం చైర్మన్ సామంతకుర్తి సురేష్‌కుమార్‌ను ముమ్మిడివరం తాలుకా రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. సురేష్ కుమార్‌ను చైర్మన్‌గా నియమించిన ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు అయినాపురపు వెంకటరావు ఆధ్వర్యంలో రజక సంఘ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కేశనకుర్తి సుబ్రహ్మణ్యం, గొల్లపల్లి ధర్మారావు, కేశనకుర్తి సుబ్బారావు, కోటిపల్లి మోహన్‌రావు, పి.బాలకృష్ణ, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సబ్సిడీకి రూ.8 కోట్ల కేటాయింపు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్లలోనూ అమలు చేస్తున్న గ్యాస్ సబ్సిడీ పథకానికి రూ.8 కోట్లు కేటాయించినట్లు సీఎం రంగసామి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎరుపు రంగు రేషన్ కార్డుకు రూ.300, పసుపురంగు రేషన్ కార్డుకు రూ.150 సబ్సిడీ ఇస్తున్నామన్నారు. అదేవిధంగా అప్పుడే పుట్టిన ఆడ శిశువులకు వారి బ్యాంకు ఖాతాల్లో రూ.50 వేలు చొప్పున డిపాజిట్ చేసే పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కుటుంబ యజమానిగా మహిళలే ఉంటే రూ.1,000 పింఛన్ ఇచ్చే పథకం ద్వారా 70 వేల మంది మహిళలు లబ్ధి పొందుతున్నారన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల పరిశీలన

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్‌ల్లో వచ్చే ఏడాది ఏప్రిల్, మే నెలల్లో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరిగే అవకాశమున్న నేపథ్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లను ఎన్నికల శాఖ సిబ్బంది ఆదివారం పరిశీలించారు. బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాడ్ తదితరమైన వాటిని రాజకీయపార్టీల ప్రతినిధుల ఎదుట పరిశీలించనున్నారు.

ఈడబ్ల్యూఎస్ నిబంధనలు అమలు చేయాలి

యానాం: విద్యా, ఉద్యోగ అవకాశాల్లో ఈడబ్ల్యూఎస్(ఆర్థికంగా వెనకబడిన వర్గం) నిబంధనలు కచ్చితంగా అమలుచేయాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గాజులగార్డెన్స్‌లోని మినీకల్యాణమండపంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లపై ప్రజాభిప్రాయం కోసం జరిగిన చర్చకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయుడు గుత్తుల రామారావు మాట్లాడుతూ యానాం నియోజకర్గంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్‌ల ఫలాలు అందనివారు ఈడబ్ల్యూఎస్ పరిధిలోకి వస్తారన్నారు. ఈడబ్ల్యూఎస్ వల్ల అగ్రవర్ణ పేదలు లబ్ధి పొందుతారని చెప్పారు. కార్యక్రమంలో విశ్రాంత ఆర్ఏఓ కాపగంటి సూర్యనారాయణమూర్తి, దవులూరి పతి, మంచాల సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ నదుల దినోత్సవం



సఖినేటిపల్లి రేవు వద్ద గోదావరి తీరం వెంబడి శుభ్రం చేస్తున్న విద్యార్థులు, బోధనా సిబ్బంది

సఖినేటిపల్లి: ప్రపంచ నదుల దినోత్సవం సందర్భంగా నదులను కాపాడుకుందాం, భవిష్యత్ తరాలకు కానుకగా అందిద్దాం అన్న నినాదంతో ఆదివారం సఖినేటిపల్లిలంక గ్రామ పరిధిలోని సఖినేటిపల్లి రేవు వద్ద పరిశుభ్రత చర్యలు చేపట్టారు. సఖినేటిపల్లిలంకకు చెందిన ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ రాజోలు క్లస్టర్ కోఆర్డినేటర్, తెలుగు టీచర్ గుండేపల్లి ప్రభావతి ఆధ్వర్యాన జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, బోధనా సిబ్బంది వ్యర్థపదార్థాలను ఏరివేసే పనులు నిర్వహించారు. రేవు వద్ద గోదావరి తీరం వెంబడి, పరిసర ప్రాంతాల్లోను వారు శుభ్రం చేశారు. కాలుష్య రహిత హరిత తోరణంగా తీరాన్ని మార్చడానికి ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని ప్రభావతి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

మంత్రి విశ్వరూప్‌ను కలిసిన న్యాయవాది అశోక్



మంత్రి విశ్వరూప్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు అశోక్

అమలాపురం రూరల్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను వైఎస్సార్ సీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన న్యాయవాది కుడిపూడి అశోక్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. భట్లవెల్లిలోని ఆయన స్వగృహానికి వెళ్లి మంత్రి విశ్వరూప్‌ను దుశ్శాలువాతో సత్కరించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి మీపై ఎంతో నమ్మకంతో కీలకమైన పదవిని అప్పగించారని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును సైతం ఆయన స్వగృహం వద్ద అశోక్ కలిశారు. వైసీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, కౌన్సిలర్ చిట్టూరి పెదబాబు ఆయనను అభినందించారు.

మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలి

యానాం: పుదుచ్చేరిలో సైతం మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని పుదుచ్చేరి పార్లమెంట్ సభ్యుడు వి.వైద్యలింగం డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంట్ ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలు, కేంద్రపాలిత ప్రాంతం ఢిల్లీకి మాత్రమే వర్తిస్తుందన్నారు. కేవలం 239ఏఏ ఆర్టికల్‌లో పొందుపరిచిన కేంద్రపాలిత ప్రాంతం ఢిల్లీకి మాత్రమే ఆ చట్టం వర్తిస్తుందని, 239ఏ ఆర్టికల్‌లో ఉన్న కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిని చేర్చలేదని చెప్పారు. అందుకే పుదుచ్చేరిని సైతం మహిళా చట్ట పరిధిలోకి తీసుకురావాలని లా అండ్ జస్టిస్ కేంద్రమంత్రి అర్జున్ రామ్‌మేఘవాల్‌ను కోరామన్నారు. అయితే ఈ చట్ట పరిధిలోకి రావాలంటే పుదుచ్చేరి అసెంబ్లీలో సైతం తీర్మానం చేయాల్సి ఉంటుందన్నారు.

మంత్రి విశ్వరూప్ పరామర్శ

అమలాపురం రూరల్: ఇటీవల గొంతు ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న రంగాపురం గ్రామానికి చెందిన రాష్ట్ర కరికల భక్త కార్పొరేషన్ డైరెక్టర్ కరెళ్ళ రమేష్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆదివారం పరామర్శించారు. రమేష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట తుని నియోజకవర్గం వైఎస్సార్ సీపీ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీ ఉడుం రామకృష్ణ, మామిళ్ళపల్లి ఫణికుమార్, ముసలి స్వర్ణసరావు, మామిళ్ళపల్లి నాని తదితరులున్నారు.

అగ్నికుల క్షత్రియ సంఘ మండల శాఖ కార్యవర్గం

పి.గన్నవరం: కోనసీమ అగ్నికుల క్షత్రియ సంఘం పి.గన్నవరం మండలశాఖ అధ్యక్షుడిగా శేరు గంగా దుర్గా ప్రసాద్ నియమితులయ్యారు. కోనసీమ అగ్నికుల క్షత్రియ సంఘం గౌరవాధ్యక్షుడు కర్రి స్వామినాథ్ ఆధ్వర్యంలో ఆదివారం పి.గన్నవరంలో జరిగిన సమావేశంలో మండల శాఖ కార్యవర్గాన్ని నియమించారు. మండల శాఖ చైర్మన్‌గా లంకే చిరంజీవి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆరధాని ఏడుకొండలు, వైస్ ప్రెసిడెంట్లుగా కొపనాతి తాతాజీ, కామాడి దశరథ రామయ్య నియమితులయ్యారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి భక్తుల విరాళాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న నిత్యాన్నదాన భవన నిర్మాణానికి భక్తుల నుంచి భారీ విరాళాలు అందుతున్నట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. రావులపాలెం మండలం దేవరపల్లికి చెందిన జి.నాగజ్యోతి రూ.25 వేలు, రాజమహేంద్రవరానికి చెందిన ఎం.వెంకట సత్య నరసింహ విజయలక్ష్మి రూ.10 వేలు, హైదరాబాద్‌కు చెందిన యు.బులి వెంకట నాగ భీమశంకర్ రూ.10,116, పేరుపాలేనికి చెందిన కె.రవి రూ.10 వేలు విరాళాలు అందించినట్లు తెలిపారు. దాతలకు ఆలయ చైర్మన్ చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మామిడికుదురు: ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆదివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పి.గన్నవరం మండలం నాగుల్లంకకు చెందిన ఆరుగురికి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే చిట్టిబాబు నగరంలో తన క్యాంపు కార్యాలయం వద్ద అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ వర్తించని వారికి సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించి ప్రభుత్వం వారిని ఇతోధికంగా ఆదుకుంటుందని చెప్పారు. సీఎం జగన్ ఎంతో ఔదార్యంతో రోగులకు సహాయం అందిస్తున్నారని చెప్పారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో డీటీ



డీటీ భానుప్రకాష్‌ను అభినందిస్తున్న ఆలయ చైర్మన్

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని డిప్యూటీ కలెక్టర్ మిమ్మితి భానుప్రకాష్‌రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు డిప్యూటీ కలెక్టర్‌ను స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి స్వామి చిత్రపటం ప్రసాదం అందజేశారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ కాకర శ్రీను, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు తదితరులు ఉన్నారు.